క్లుప్తంగా

18వ విడత సోషల్ ఆడిట్



రికార్డులను పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

ఉయ్యాలవాడ: మండలంలో జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ బృందం 18వ విడత రికార్డుల పరిశీలన కార్యక్రమం ఆదివారం ప్రారంభించింది. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 20 గ్రామ పంచాయతీల పరిధిలో 699 పనులకు సంబంధించి కూలీల వేతనాలు, మెటీరియల్ కాంపౌండ్ తదితర వాటికి రూ. 6.27 కోట్లు ఖర్చు చేశారు. ఈ మేరకు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, కూలీలకు వేతనాల పంపిణీకి సంబంధించి సామాజిక తనిఖీ బృందం ఫిబ్రవరి 1 నుంచి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయనున్నట్లు ఆ శాఖ ఏపీఓ రవిప్రకాష్ వెల్లడించారు.

పెద్దమ్మకు పూజలు



దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాలు చేసి హారతులు పట్టారు. గాజులు, నిమ్మకాయలు, చీరలు, పిండివంటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గుడిలో చోరీ

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలిసిన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామస్తులు, ఆలయ పూజారి రమణయ్య అందించిన సమాచారం మేరకు.. ప్రతిరోజులాగే ఆదివారం ఉదయం పూజారి ఆలయంలో పూజ చేసి ఇంటికెళ్లాడు. ఆ సమయంలో స్వామి విగ్రహంపై ఆభరణాలున్నాయి. తిరిగి సాయంత్రం పూజారి ఆలయానికి చేరుకొని తలుపులు తెరిచిచూడగా స్వామికి అలంకరించిన వెండి పాదాలు, భక్తులకు తీర్థం వేసే వెండి గిన్నె, గరిటె, శఠగోపంతో పాటు కిలో మేరకు వెండి సామన్లు కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని నిర్ధారించుకొని గ్రామస్తులతో కలిసి ఉయ్యాలవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని సంఘమిత్ర నిరాశ్రిత బాలుర ఆవాస కేంద్రం వార్షికోత్సవం సందర్భంగా కేంద్రం విద్యార్థులు ప్రదర్శించిన సందేశాత్మకమైన నాటికలు, జానపద గీతాలు, దేశ భక్తి పాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం సంఘమిత్ర 31వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక ప్రథమనంది దేవస్థానంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, బీజేపీ పార్లమెంటరీ అధ్యక్షుడు అభిరుచి మధు, ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త, సంఘమిత్ర అధ్యక్షుడు కర్నాటి నాటసుబ్బారెడ్డి, చిలుకూరి శ్రీనివాస్‌పాండే, గంగదాసరి నరసింహారెడ్డి, సురేష్‌కుమార్, మేడా మురళీ, చింతలపల్లి వాసు, విజయశ్రీ, డాక్టర్ ఉదయ్‌శంకర్, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగులకు మందుల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఐఎంఏ వైద్యుల సహకారంతో దివ్యాంగులకు ఆదివారం మందులు పంపిణీ చేశారు. సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ దివ్యాంగులకు దీర్ఘకాలిక జబ్బులకు ప్రతి నెల రూ.15వేల విలువజేసే అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నామన్నారు. అనంతరం వైద్యులను సంఘం నాయకులు సత్కరించారు. వైద్యులు భార్గవవర్ధన్‌రెడ్డి, తారకేశ్వరరెడ్డి, అశోక్, పాండురంగారావు, రమణయ్య, మధు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్, షటిల్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): రిపబ్లిక్ డేను పురస్కరించుకొని నంద్యాల కాస్మో పాలిటన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లాల బ్యాడ్మింటన్, షటిల్, డబుల్స్, మిక్స్‌డ్, ట్రిపుల్స్ పోటీలు కొనసాగాయి. స్పోర్ట్స్ సెక్రటరీ కాంతారెడ్డి, టోర్నమెంట్ కన్వీనర్ ఖాన్ పాల్గొని బ్యాడ్మింటన్ క్రీడాకారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉదయం 6 నుంచి రాత్రి 11గంటల వరకు ఫ్లడ్ లైట్స్ వెలుతురులో క్లబ్ ఆవరణలో పోటీలు జరుగుతున్నాయని వారు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి 20వ తేదీన 40,50 సంవత్సరాలు పైబడిన, మిక్స్‌డ్ ట్రిపుల్స్ టోర్నమెంట్‌లో 30ప్లస్, 40ప్లస్, 60ప్లస్ విజేతలకు వరుసగా..రూ.6వేలు, రూ.4వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి అందజేస్తామని చెప్పారు.

డాక్టర్ అవ్వాలని ఉంది



ఆటలంటే నాకు ఎంతో ఇష్టం. అందుకే అదే స్ఫూర్తితో ఆర్చరీ విభాగంలో సత్తాచాటి బంగారు పతకాన్ని సాధించాను. క్రీడల్లో ప్రతిభ చాటడమే కాకుండా మంచిగా చదివి డాక్టర్ అవ్వాలని ఉంది. అందుకు తగ్గట్టుగానే పాఠశాలలో బాగా బోధిస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో మంచి వసతులు ఉన్నాయి. ఈ పాఠశాలలో చదవడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

–మానస, ఇంటర్ సెకండ్ ఇయర్

పోలీస్ అవుతా



ఆటలంటే ప్రాణం. చదువుపై ఎంత శ్రద్ధ చూపుతానో ఆటల్లో కూడా అలాగే ఉంటా. జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించడం గర్వంగా ఉంది. చదువు పూర్తి కాగానే స్పోర్ట్స్ కోటాలో పోలీస్ ఉద్యోగం సాధిస్తాను.

–పావన నాగదినేష్, ఇంటర్ ఫస్ట్ ఇయర్

సంతోషంగా ఉంది



చిన్నప్పటి నుంచి ఆటలంటే సరదాగా ఉండేది. ఇప్పుడు ఆ ఆటలే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేంత వరకు దారితీశాయి. టెన్నిస్ బాల్ క్రికెట్‌లో బంగారు పతకాన్ని సాధించడం ఎంతో సంతోషంగా ఉంది. ముమ్ముందు మరింత సత్తా చాటి స్పోర్ట్స్ కోటాలో మంచి ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం ఉంది.

–చరిత, 10వ తరగతి

ఒలింపిక్స్‌లో ఆడాలని ఉంది



క్రీడల్లో జాతీయ స్థాయి వరకు వెళ్లేలా పాఠశాల ప్రిన్సిపాల్, పీడీ ఎంతో సహకారం అందించారు. వారి సహకారాన్ని వృథా పోనీయకుండా ఆటల్లో మంచి మెళకువలు ప్రదర్శించి ప్రత్యర్థులను మట్టికరిపించాను. రెజ్లింగ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటి పతకాన్ని సాధించాను. ఎంత కష్టమైనా భరించి ఒలింపిక్స్ వరకు వెళ్లాలని ఉంది.

–శశిధర్, ఇంటర్ సెకండ్ ఇయర్

సరిలేరు.. మాకెవ్వరు

- అదరహో ఆదర్శ పాఠశాల
- విద్యలో మంచి ఫలితాలు
- క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణింపు



ఆర్చరీలో పోటీ పడుతున్న బాలిక



విద్యార్థులతో వరి నాట్లు వేయిస్తున్న ఉపాధ్యాయులు



టెన్నిస్ బాల్ క్రికెట్‌లో విజయం సాధించిన బాలికల జట్టు

రుద్రవరం: చదువులోనైనా ఆటల్లో అయినా మాకు మేమే సాటి.. మాకెవ్వరు లేరు పోటీ అంటున్నారు ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులు. క్రీడల్లో సత్తా చాటుతూ జాతీయ స్థాయిలో అదరగొడుతున్నారు. గోల్డ్, సిల్వర్ పతకాలతో పాటు మరెన్నో మెమెంటోలు అందుకున్నారు. విద్యలోనూ ప్రతిభ కనబరుస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. తాజాగా 5 ఎంబీబీఎస్ సీట్లు సాధించి తమ సత్తా ఎంటో చూపించారు. ప్రకృతి వ్యవసాయంతో కూరగాయలు పండిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పొలాలకు వెళ్లి వ్యవసాయ పనుతు చేస్తూ అనుభవం పొందుతున్నారు. సమాజంలో జరిగే పలు అంశాలపై ర్యాలీలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలలకే ఆదర్శంగా నిలుస్తున్నారు. రుద్రవరం మండలం మజరా గ్రామమైన తువ్వపల్లె తిప్పమీద అప్పటి ప్రభుత్వం ఏపీ మోడల్ పాఠశాలను ప్రారంభించింది. మొదట్లో వసతులు అంతంత మాత్రంగా ఉండడం సరైన రవాణా సౌకర్యం లేకపోవడం, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు ఉండేవి. దీంతో విద్యార్థుల సంఖ్య కేవలం 300లోపే ఉండేది. వసతులలేమి కారణంగా విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధించలేకపోయేవారు. కేవలం 60 నుంచి 70శాతం మాత్రమే ఫలితాలు వచ్చేవి.

2021 నుంచి మారిన పరిస్థితులు

ఆ పాఠశాలకు 2021లో ప్రిన్సిపాల్‌గా సంగెపు నాగేశ్వరరావు బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఆ పాఠశాల తీరే మారింది. ఆయన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల వద్ద చొరవ చూపి వసతుల కల్పనకు కృషి చేశారు. అంతే వసతులు సమకూరాయి. బోధకుల సంఖ్య పెరిగింది. నాణ్యమైన విద్య అందుతోంది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య దాదాపు 650 వరకు చేరింది. గతంలో పల్లెల నుంచి విద్యార్థులను తీసుకొచ్చేందుకు 3 ఆర్టీసీ బస్సులు ఉండేవి. ప్రస్తుతం 6 ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. వసతులకు తగ్గట్టుగానే పదో తరగతిలో వంద శాతం, ఇంటర్‌లో 80 శాతం ఫలితాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. అలాగే పలు రకాల ప్రాజెక్టుల్లో జిల్లా స్థాయిలో నిలిచారు. ఇంటర్ పూర్తి చేసిన వారిలో ఒకరు పోస్టల్ ఉద్యోగం సంపాదించడం, ఇద్దరు ఇంజినీరింగ్‌కు క్యాంపస్ సీట్లు దక్కించుకున్నారు. మరో ఐదుగురు ఎంబీబీఎస్ సీట్లు సాధించడం గమనార్హం.



రెజ్లింగ్‌లో పోటీల్లో..

సాధించిన పతకాలు

ఇప్పటి వరకు జాతీయ స్థాయిలో 6 బంగారు ,6 వెండి, 12 రజత పతకాలు, రాష్ట్ర స్థాయిలో బంగారు 33, వెండి 11, రజతం 24 మెడల్స్ సాధించి శభాష్ అనిపించుకున్నారు.

క్రీడల్లో దిట్ట

చదువు, వ్యవసాయం వంటివి ఒకఎత్తు అయితే క్రీడల్లో మాత్రం అదరగొడుతున్నారు. బరిలోకి దిగితే పతకం సాధిస్తున్నారు. ప్రధానంగా కబడ్డీ, అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్, శపక్‌తక్రా, క్రికెట్ ,జంప్‌రోప్, బేస్‌బాల్ వంటి క్రీడల్లో ఆరితేరారు. పాఠశాల పీడీ శ్రీనివాసులు ఆటల్లో మంచి తర్ఫీదు ఇస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటుతున్నారు.

వ్యవసాయంలోనూ అనుభవం

కేవలం చదువే కాకుండా వ్యవసాయ రంగంలో అనుభవం పొందుతున్నారు. స్వతహాగా పాఠశాల ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టి కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసి కూరగాయలు పండిస్తున్నారు. అంతే కాకుండా పాఠశాలకు దగ్గరలో ఉన్న పొలాలకు వెళ్లి రైతులు చేస్తున్న పనులను పరిశీలించడం, రైతులతో పాటు పొలాల్లోకి దిగి పనులు సాగిస్తూ అనుభవం పొందుతున్నారు.

బాలబాలికలను మంచిగా తీర్చిదిద్దడమే లక్ష్యం



పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న బాలబాలికలను దృఢంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. ప్రతి రోజు పాఠశాల మైదానంలో వారికి బ్యాచ్‌ల వారీగా ఆటల్లో తర్ఫీదు ఇస్తున్నాను. ఆయా ఆటలకు సంబంధించి అవసరాన్ని బట్టి మెలకువలను నేర్పుతున్నాను. ఎక్కడికి తీసుకెళ్లినా పతకాలతో వస్తున్నారు. ఇప్పటికే 200 మంది వరకువివిధ పోటీల్లో పాల్గొన్నారు. ఏటా 150 నుంచి 170 మందికి ఆటల్లో తర్ఫీదు ఇస్తున్నాను.

–శ్రీనివాసులు, పీడీ

చాలా సంతోషంగా ఉంది



పాఠశాల విద్యార్థులను ఎంతో క్రమశిక్షణతో నడిపిస్తున్నాం. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యార్థులు ఎవరి చేతుల్లో సెల్‌ఫోన్ ఉండకూడదని నిబంధన విధించాం. అందుకు తగ్గట్టుగానే అందరూ నడుచుకుంటున్నారు. చదువుల్లో ఉత్తమ ఫలితాలు, క్రీడల్లో జాతీయ స్థాయిలో పాల్గొని ఎన్నో పతకాలు సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెట్టడం చాలా సంతోషంగా ఉంది.

–సంగెపు నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్

12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి



మాట్లాడుతున్న సాంబశివుడు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగులకు 12వ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగరి శ్రీనివాసులు, సాంబశివుడు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఏడవ వేతన సవరణ సంఘం గడువు 2025 డిసెంబర్ వరకు ఉప్పటికీ సంవత్సరం ముందే 8వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వెంటే నియమించాలని కోరారు. 12వ పీఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలు, పీఎఫ్ లోన్లు, ఆర్జిత సెలవుల నగదు, చెల్లింపులను తక్షణమే ఉపాధ్యాయుల ఖాతాకు జమ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పుల్లయ్య, రవి, పవన్‌కుమార్, మునిస్వామి, వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, మద్దిలేటి, జయరాం, ప్రతాపరెడ్డి, గురువయ్య, వెంకటకృష్ణుడు పాల్గొన్నారు.

తెలుగు రసగుళికలు వేమన పద్యాలు



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): సమాజంలోని అసమానతలు, మూఢనమ్మకాలపై తన అక్షరాస్త్రాలను సంధించిన, సాహితీ దేవుడు వేమన అని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసమూర్తి పేర్కొన్నారు. ఆదివారం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో పింగళి సూరన శాఖా గ్రంథాలయంలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువు కంటే సంస్కారం ముఖ్యమని తన పద్యాల ద్వారా యువతను హెచ్చరించారని గుర్తు చేశారు. తెలుగు పండిట్ అన్నెం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో నాటుకొని పోయిన అంధ విశ్వాసాలపై వేమన సంధించిన పద్యాలన్నీ చురకత్తులవంటివన్నారు. అనంతరం గ్రంథాలయానికి స్టడీ ప్యాడ్‌లను అందజేశారు. కవులు నీలం వెంకటేశ్వర్లు, శ్రీధర్, మహబూబ్‌బాషా, మధుసూదన్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఖజానా సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు



ఎన్నికైన నూతన కార్యవర్గం

నంద్యాల(అర్బన్): స్థానిక జిల్లా ఖజానా కార్యాలయంలో ఆదివారం ఖజా, లెక్కల సర్వీసెస్ అసోసియేషన్ నంద్యాల జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికారిగా ప్రభుదాసు, సహాయ ఎన్నికల అధికారిగా సురేష్, ఎన్నికల పరిశీలకులుగా అనిల్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా శ్రీనివాసరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా తేజాబాబు, ఉపాధ్యక్షులుగా సుమలత, భాస్కరరెడ్డి, దినేష్‌కుమార్, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రాజేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్, సుబాషిణి, మురళీకృష్ణుడు ఎన్నికయ్యారు.



రోడ్డుపై పడిన గొయ్యి

అదుపు తప్పితే అంతే!

దొర్నిపాడు: ప్రస్తుతం అక్కడక్కడా గతుకులకు అతుకులు వేస్తున్నారే తప్పా కల్వర్టుల సమీపంలో రహదారులపై పడ్డ గోతులను సరిచేయలేకపోతున్నారని వాహనదారులు వాపోతున్నారు. కోవెలకుంట్ల మండలం కంపమల్ల మెట్ట నుంచి దొర్నిపాడు మండలం డబ్ల్యూ గోవిందిన్నె గ్రామానికి వెళ్లే దారిలో పడ్డ గోతి వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పాత వాహనదారులు అయితే ఆ ప్రాంతానికి వచ్చేసరికి నెమ్మదిగా వెళ్తున్నారు. కొత్తవారు మాత్రం తెలియక ప్రమాదాలకు గురువుతున్నారు. ముఖ్యంగా ఈ దారిలో వ్యవసాయ పనులు చేసుకునే కూలీలు ఆటోల్లో రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉయ్యాలవాడ: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చన్నారు. రెవె న్యూ కార్యాలయంలో జరిగే ఈ ప్రజా వేదికకు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు.

రేపటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

దొర్నిపాడు: మండలంలో మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు ఆధార్‌లో సవరణల కోసం ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న దొర్నిపాడు-1, 22న దొర్నిపాడు-2, 23న కొండాపురం, 24న బుర్రారెడ్డిపల్లె, 27, 28 తేదీల్లో చాకరాజువేముల, 29, 30 తేదీల్లో డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లోని సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఆధార్‌లో ఏమైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలని స్థానికులకు సూచించారు.

విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి

గోస్పాడు: విద్యుత్ వినియోగదారుల నుంచి బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞాన సూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సూచించారు. విద్యుత్ బిల్లులు కూడా సకాలంలో వసూలు అయ్యేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పశు వైద్య శిబిరాలు

చాగలమర్రి: మండలంలో సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వరప్రసాద్ తెలిపారు. సోమవారం పెద్దబోధనం, చిన్నవంగలిలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

24 నుంచి టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు

చాగలమర్రి: మండల కేంద్రంలోని బుగ్గరస్తా క్రీడా మైదానంలో ఈ నెల 24వ తేదీ నుంచి నియోజకవర్గ స్థాయి హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అల్తాఫ్, రఫీ తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ రూ.5 వేలు నగదు బహుమతులను అందజేస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న జట్లు ఈ నెల 23వ తేదీలోపు 6301659818, 9398523698 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

నంద్యాల(వ్యవసాయం): సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు ఆదివారం స్థానిక సత్యసాయి కల్యాణ మండపంలో బహుమతులు అందజేశారు. సంఘం అధ్యక్షుడు నగరడోన సుధీర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలోని బ్రాహ్మణ మహిళలు పాల్గొన్న పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశామని చెప్పారు.

అమిత్‌షా పర్యటనపై నిరసన



సంజీవనగర్ సెంటర్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం

నంద్యాల(న్యూటౌన్): కేంద్రహోం శాఖ మంత్రి రాష్ట్రంలో పర్యటించడం రాష్ట్ర ప్రజలను అవమానపరచడమేనని, ఆయన పర్యటనను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో వివిధ చోట్ల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, సీపీఎం నాయకులు తోటమద్దులు, లక్ష్మణ్, రాజశేఖర్, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం పద్మావతినగర్ ఆర్చ్, సంజీవనగర్ సెంటర్, సాయిబాబానగర్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమాన పరిచేలా మాట్లాడిన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని, ముందు దేశప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 11 సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగం నిర్దేశించిన హక్కులను కాలరాయడమే కాకుండా ప్రస్తుతం రాజ్యాంగాన్ని మంత్రులే అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. హక్కులను కాపాడాలని పోరాడుతున్న వారిపై అక్రమకేసులు బనాయించి హింసిస్తున్నారని ఆరోపించారు. సీపీఐ నాయకులు శ్రీనివాసులు, ధనుంజయుడు, నాగరాముడు, న్యూడెమొక్రసీ నాయకులు చౌడప్ప, రాంబాబు, గోపాల్, సుబ్బరాయుడు, సీపీఎం మహమ్మద్‌గౌస్ పాల్గొన్నారు.



వెంకటేశ్వరనగరంలో సాగుచేసిన ఆవాల పంట

ఆశాజనకంగా ఆవాలు

దొర్నిపాడు: ఆరుతడి పంటలతో తక్కువ పెట్టుబడి అధిక రాబడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. చాలా మంది రైతులు రబీలో వరికి ప్రత్యామ్నాయంగా ఆవాల పంటను సాగు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా ఆవాలు రూ.10వేలకు పైగా ఉందని, దీంతో ఎకరానికి మూడు బస్తాలు వచ్చినా గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.

ఒకసారి పొలానికి నీరు కట్టి అలా చల్లితే సరిపోతుంది, పూత సమయంలో ఓసారి రసాయన మందు పిచికారీ చేస్తే సరి పంట చేతికి వస్తుందని అంటున్నారు. ప్రస్తుతం చాలా మంది రైతులు ఆవాల సాగుకు శ్రీకారం చుట్టడంతో ఆశాజనకంగా కనిపిస్తుంది.

సీతారాములకు విశేష పూజలు



మహానంది: శివకేశవులకు నిలయమైన మహానందిలో కొలువైన శ్రీ సీతారాముల వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకం, అర్చన, మహా మంగళ హారతులు జరిపారు. పలు ప్రాంతాల భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



రోడ్డు పక్కనే ఉన్న కాలువ

ఆదమరిస్తే కాలువలోకే !

బండిఆత్మకూరు: నంద్యాల–ఆత్మకూరు ప్రధాన రహదారిలోని పెద్దదేవళాపురం గ్రామ సమీపంలో రోడ్డుకు ఒకవైపు సైడు బర్మ్ పూర్తి గా లేకపోవడంతో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. పక్కనే లోతైన కాలువ ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ రోడ్డులో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, మహానంది ఉండటంతో ప్రతి రోజు వందలాది వాహనాలు తిరుగుతుంటా యి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా సైడ్‌బర్మ్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.